క్లుప్తంగా

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

గుడ్లూరు: హైదరాబాద్‌లో ఆగస్టు రెండో వారంలో మంద క్రిష్ణమాదిగ ఆధ్వర్యంలో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని నియోజకవర్గ మహాజన సోషలిస్టు పార్టీ ఇన్‌చార్జి రావినూతన ముత్తు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్లపాలెంలో ఎంఆర్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొని రావడానికి నిర్వహిస్తున్న ఈ మహాసభకు మండలం నుంచి అధిక సంఖ్యలో మాదిగలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఎంఆర్పీఎస్ కోకన్వీనర్ కాంతారావు మాదిగ, మండల నాయకులు ప్రసాద్ మాదిగ, సందీప్, సుదీర్‌పాల్, జైపాల్, సురేష్, బుజ్జిబాబు, కృపారావు పాల్గొన్నారు.

26 నాటు కోళ్లు అపహరణ

గుడ్లూరు: కోళ్ల షెడ్ లో పెంచుతున్న నాటుకోళ్లను అపహరించుకుపోయారు. ఈ సంఘటన చెమిడిదపాడులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చిత్తారి నాగమల్లేశ్వరావు గ్రామ సమీపంలో ఉన్న మామిడితోటలో షెడ్ వేసి జాతినాటుకోళ్లను పెంచుతున్నాడు. పోట్లూరు ఎస్టీ కాలనీకి చెందిన కొందరు యువకులు రెండు రోజుల క్రితం తోటలోకి వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన సీసీ కెమెరాను ధ్వంసం చేసి షెడ్‌లో ఉన్న 26 కోళ్లను అపహరించుకుపోయారు. దీని పై బాధితుడు నాగమల్లేశ్వరరావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్‌రెడ్డి తెలిపారు. వారి నుంచి 13 కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోళ్ల విలువ రూ.లక్ష పైన ఉంటుందని బాధితుడు నాగమల్లేశ్వరరావు తెలిపారు.

ఎంఈఓ పరిశీలన


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

ఉలవపాడు: మండల పరిధిలోని వీరేపల్లి యూపీ పాఠశాల, వీరేపల్లి వైసీ, చాగల్లు యూపీ పాఠశాలలను ఎంఈఓ ప్రసాదరావు గురువారం పరిశీలించారు. విద్యార్థుల విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. విద్యార్థుల నోటుపుస్తకాలు, వర్క్ పుస్తకాలను తనిఖీ చేశారు. జగనన్న విద్యాకానుక అందరికీ అందిందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రెండో ఎంఈఓ రమణయ్య కృష్ణాపురంలోని ఎలిమెంటరీ పాఠశాలను, జీవీవీకె పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు.

భక్తిశ్రద్ధలతో పీర్లచావిడి వద్ద ప్రార్థనలు


పీర్లచావిడి చెట్టు వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పామూరు: మొహర్రం (పీర్లపండుగ)లో భాగంగా గురువారం మండల కేంద్రమైన పామూరు తూర్పువీధి పీర్లచావిడి చెట్టువద్ద భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు చావిడి కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీచేశారు. కార్యక్రమంలో హిందూ, ముస్లిం లు పాల్గొన్నారు.

ఆలయాల్లో హుండీలు చోరీ


హుండీ వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

ఉలవపాడు: ఉలవపాడులోని రెండు ఆలయాల్లో గురువారం తెల్లవారుజామున రెండు హుండీలో చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని దొంగలు పోలేరమ్మ గుడిలో హుండీని ఎత్తుకువెళ్లారు. కొంచెం ముందు గుంట వద్దకు వెళ్లి హుండీ పగలగొట్టి అందులో నగదు తీసుకుని వెళ్లారు. కనకదుర్గమ్మ గుడిలో హుండీని తీసుకుని గుడి ఆవరణలోనే వెనుక వైపుకు వెళ్లి పగులగొట్టి నగదు తీసుకువెళ్లారు. కనకదుర్గమ్మ గుడి హుండీలో రూ.4వేలు, పోలేరమ్మ గుడిలో రూ.3 వేల వరకు నగదు ఉండొచ్చని గుడి నిర్వాహకులు సురేంద్రరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. క్లూస్ టీమ్ వచ్చి వివరాలు సేకరించారు. గుడి ఆవరణలో ఉన్న సీసీ ఫుటేజీ కూడా పరిశీలిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు జూదరులు అరెస్టు

కొండపి: గ్రామాల్లో ఎక్కడైనా పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వైవీ రమణయ్య హెచ్చరించారు. మండలంలోని జాళ్లపాలెంలో పేకాట ఆడుతున్న స్థావరంపై గురువారం దాడి చేసి ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి రూ.4200 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

చిరస్మరణీయుడు అబ్దుల్ కలాం

● ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక వైఎస్సార్ భవన్‌లో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చైర్మన్ అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ డాక్టర్ ఏపిజే కలాం గొప్ప శాస్త్రవేత్త, మానవతా వాది అని కొనియాడారు. రాష్ట్రపతిగా, అణు పితామహుడుగా అబ్దుల్ కలాం అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, సొసైటీ అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు తమ్మినేని సుజాతరెడ్డి, దాసరి మురళీ, పెన్నా ఏడుకొండలు, కోఆప్షన్ సభ్యుడు గూడూరి అబ్రహం లింకన్, పార్టీ నాయకులు ఎస్‌కే మన్సూర్, కాసుల చిన గురవయ్య, రాజు, కంటు గురవయ్య, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శం

కందుకూరు: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు రహీం మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి కలాం అని, శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టి దేశం గర్వించదగ్గ పౌరుడిగా ఎదిగిన అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. నేటి యువతకు ఆయన జీవితం ఓ పుస్తకం లాంటిదని, ఆయన స్ఫూర్తిని కొనసాగించాలని పిలుపునిచ్చారు. జిల్లా వక్ఫ్‌బోర్డు సభ్యులు సంధానిభాష, నజీర్‌మౌల్వి, నయీమ్‌బాష, బాబు, అబ్దుల్‌నబీ, శివకృష్ణ, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అడుగుజాడల్లో నేటి యువత నడవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు, స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్‌చాంద్‌బాషా అన్నారు. స్థానిక విరువూరురోడ్డులోని షాదీఖానాలో గురువారం మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్‌కలాం వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాస్త్రవేత్తగా, దేశ ప్రథమ పౌరుడిస్థాయి వరకు ఎదిగిన కలాంను ప్రతివిద్యార్థి ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ నాయబ్‌రసూల్, కోడిగుంపల నాయబ్‌రసూల్, జిలానీ, కాలేషా, బాదుల్లా, గౌస్‌బాషా పాల్గొన్నారు.


పామూరులో కలాం చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

● పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ వాకా వెంకటరెడ్డి


డాక్టర్లు, వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ

మర్రిపూడి: రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కాకర్ల పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆస్పత్రి సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాకర్ల పీహెచ్‌పీ పరిధిలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు, అంటురోగాలు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉండి రోగులకు సేవలందించాలన్నారు. ఇంటింటి సర్వే చేపట్టి జ్వర పీడితులను గుర్తించాలని చెప్పారు. పీహెచ్‌సీలో నెలలో నాలుగు కాన్పులు చేయడం అభినందనీయమన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యశాలలో స్కానింగ్ పరికరం అందుబాటులోకి తీసుకురావాలని, సీసీ రోడ్ ఏర్పాటు చేయాలని, అసంపూర్తిగా ఉన్న వైద్యశాల భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని వైద్య సిబ్బంది కోరగా ఎంపీపీ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో వైద్యాధికారి పి.కీర్తిశ్రీ, హెచ్‌ఈఓ ఏడుకొండలు, ఫార్మసిస్ట్ శ్రీను, హెచ్‌ఎస్ శ్రీకాంత్, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని వైఎస్సార్ సీపీ నాయకురాలు ఎంపీపీ గాయం సావిత్రి అన్నారు. గురువారం లింగంగుంట్లలో రిలియన్స్ ఫౌండేషన్, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్లాంట్ ఫర్ లైఫ్ అనే కార్యక్రమంలో భాగంగా లింగంగుంట్లలో సచివాలయ ప్రాంగణంలో వివిధ రకాలకు చెందిన 250 మొక్కలను నాటారు. ఎంపీపీ గాయం సావిత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. వాతారణం కాలుష్యం కాకుండా పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, వైఎస్ ఎంపీపీ కొదమల బెంజి, ఈఓఆర్డీ షేక్ షరీఫ్, కార్యదర్శి కె.రాజు, హెచ్ఎం సుబ్బారెడ్డి, క్షేత్ర సహాయకుడు కె.వెంకటేశ్వరెడ్డి, గుంటక రమణారెడ్డి, లక్ష్మీరెడ్డి, చిన్నబాబు, గ్రామస్తులున్నారు.

నానో యూరియాతో రైతులకు మేలు


ప్రధానమంత్రి ప్రసంగాన్ని టెలివిజన్‌లో వీక్షిస్తున్న ఏడీఏ, రైతులు

కొండపి: నానో యూరియాతో రైతులకు మేలు జరుగుతుందని సింగరాయకొండ ఏడీఏ నిర్మల కుమారి తెలిపారు. పీఎం మోదీ రాజస్థాన్‌లో ఆవిష్కరించిన నానో యూరియా కార్యక్రమాన్ని గురువారం స్థానిక గ్రోమోర్ కేంద్రం నుంచి వ్యవసాయశాఖ అధికారులు రైతులతో కలిసి టెలివిజన్‌లో వీక్షించారు. ఏడీఏ మాట్లాడుతూ.. అర లీటరు నానో యూరియాను ఎకరం పొలానికి పిచికారీ చేసుకోవచ్చని, గతంలో మాదిరి యూరియా బస్తాలను పొలానికి మోసుకెళ్లాల్సిన పనిలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సబ్సిడీపై ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందిస్తూ వ్యవసాయానికి ఊతం ఇస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఓ విజయ్‌కుమార్, భారత పొగాకు బోర్డు సభ్యులు బొడ్డపాటి బ్రహ్మయ్య, మండల బీజేపీ అధ్యక్షుడు బి.వెంకట్రావ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పి.మాధవ, ఎం.కొండపునాయుడు, గ్రోమోర్ మేనేజర్ ప్రసాద్, ఫీల్డ్ మేనేజర్ ఏడుకొండలు, రైతులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింస అరికట్టాలి


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కందుకూరు: మణిపూర్‌లో హింసను ప్రేరేపిస్తున్న సంఘ వ్యతిరేక శక్తులను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలు ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్ హింసను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో గురువారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మణిపూర్ ఘటన ప్రమాదవశాత్తు జరిగింది కాదని సంఘపరివార్ ప్రభుత్వ ప్రోత్సాహం ఉందని ఆరోపించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, గాండ్ల హరిప్రసాద్, ముప్పవరపు కిశోర్, దార్ల నరశింహం, దమ్మాల నాగేశ్వరరావు, కత్తి ఐజాక్, మున్నింగి రమేష్, బెజవాడ కొండయ్య, సంఘా మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువుకు సాగర్ జలాలు


అట్లపల్లి చెరువుకు నీరు పెడుతున్న జెడ్పీటీసీ, ఏఈ


పంపింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కురిచేడు: జిల్లా ప్రజల తాగునీటి అవసరాలకు సరఫరా చేసిన సాగర్ జలాలను స్థానిక అట్లపల్లి రిజర్వాయర్ నింపేందుకు ఏర్పాట్లు చేశారు. జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ థావూ నాయక్‌లు తమ సిబ్బందితో సాగర్ కాలువ నుంచి పైపుల ద్వారా చెరువు నింపేందుకు చర్యలు తీసుకున్నారు. చెరువుకు నింపుతూనే ఒక పైపు ద్వారా నేరుగా ఫిల్టర్‌బెడ్‌లకు పంపేందుకు ఇటీవల జిల్లా పరిషత్ గ్రాంట్ రూ.10 లక్షలతో పైపులైను ఏర్పాటు చేశారు. సాగర్ కాలువకు నీరు సరఫరా జరిగినంతకాలం నేరుగా కాలువ నుంచి ఫిల్టర్‌బెడ్‌లకు వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. ఆ విధానాన్ని అట్లపల్లి చెరువు సగం నిండిన తర్వాత చెరువు నింపుతూ కొత్త విధానం ప్రారంభిస్తామని జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఏఈ థావూనాయక్‌లు సంయుక్తంగా తెలిపారు.

దొనకొండ: మండలంలోని చందవరం సమీపంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చందవరం-1, చందవరం-2 మంచి నీటి స్టోరేజీ ట్యాంక్‌లు నిర్మించారు. ఆ ట్యాంక్‌లో నీరు సరఫరా చేసేందుకు నీటి మట్టం తగ్గిపోయింది. గత వారం నుంచి సాగర్ జలాలు కాల్వల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్‌ఏపీ అధికారులు సమ్మర్ స్టోరేజీలకు సాగర్ జలాలు నింపే కార్యక్రమం చేపట్టారు. చందవరం-1 ట్యాంక్‌కు-4, చందవరం-2 ట్యాంక్‌కు-3 మోటార్ల ద్వారా అధికారులు యుద్ధ ప్రాతిపదికన పంపింగ్ చేయిస్తున్నారు. సాగర్ కెనాల్లో నీరు నిలిచే లోపు స్టోరేజీ ట్యాంక్‌లకు సాగర్ జలాలు సాధ్యమైనంత వరకు నింపి గ్రామాల్లోని ప్రజలకు మంచినీటి ఇబ్బందులు లేకుండా సరఫరా జరిగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

డయల్ యువర్ డీఎంకు 8 ఫిర్యాదులు

కందుకూరు: డయల్‌యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజల నుంచి 8 ఫిర్యాదులు వచ్చినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ పెద్దన్నశెట్టి తెలిపారు. వీటిలో పామూరు నుంచి విజయవాడకు కందుకూరు డిపో నుంచి రెగ్యులర్‌గా ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడపాలని, పామూరు నుంచి ఒంగోలుకు ఉదయం 6-7గంటల ప్రాంతంలో బస్సులు కావాలని నరసింహారావు అనే ప్రయాణికుడు కోరాడు. దీనిపై స్పందించిన డీఎం ఉదయగిరి డిపోకు చెందిన బస్సులు విజయవాడకు నడుపుతున్నారని, ఒంగోలు డిపోకు చెందిన బస్సులు పామూరు నుంచి ఒంగోలుకు నడుస్తున్నాయని చెప్పారు. పై అధికారులతో చర్చించి కందుకూరు డిపో బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అలాగే సింగరాయకొండ నుంచి కందుకూరుకు అర్ధరాత్రి సమయంలో బస్సులు ఉండడం లేదని, ట్రిప్స్‌లో వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అద్దంకి వాసు అనే ప్రయాణికుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై సర్వే నిర్వహించి బస్సు ఏర్పాటు చేస్తామని డీఎం తెలిపారు.

పెదపవని నుంచి గుడ్లూరు, స్వర్ణాజీపురం మీదుగా ఉలవపాడుకు బస్సు కావాలని కోరగా ఆ రూట్‌లో ఆదాయం తక్కువగా ఉన్నందున బస్సును రద్దు చేశామన్నారు. అలాగే బద్దిపూడి నుంచి భీమవరం హైస్కూల్‌కు, సింగరాయకొండ నుంచి కరేడుకు అదనపు ట్రిప్పులు, పరకొండపాడు నుంచి మాచవరం బస్సు సౌకర్యం కావాలని పలువురు ప్రయాణికులు కోరారు.

రూ.50వేల ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న కమిటీల నాయకులు

కనిగిరి రూరల్: తీవ్ర అనారోగ్యంతో వైద్య చికిత్సలకు ఇబ్బంది పడుతున్న సాయి భక్తురాలికి రూ.50వేల ఆర్థిక సాయం గురువారం అందచేశారు. స్థానిక షిర్డీ సాయి బాబా దేవస్థానం, కోదండరామస్వామి దేవస్థానం, మానవతా సేవా సంఘం సభ్యుల చేయూత, సహకారంతో రూ.50వేలు సాయం చేసినట్లు సాయిబాబా దేవస్థాన కమిటీ అధ్యక్షుడు దేవకి సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో ఆయా కమిటీల నాయకులు వాగిచర్ల వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మ, పెన్నా వెంకటేశ్వర్లు, చక్కా లత, కొలిపాకుల శ్వేత, వాగిచర్ల రమ, బొమ్మిశెట్టి రమా దేవి, కొట్టే శ్రావణి, సాయి మహిళా సేవ బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత


నోట్ పుస్తకాలు అందజేస్తున్న దాత చంద్రశేఖర్

మర్రిపూడి: మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ వెలుగురి చంద్రశేఖర్ చేతులమీదుగా 400 నోట్ పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీరాం మురళి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. తోటి విద్యార్థులు ప్రేరణ చెందేందుకు 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1500 చొప్పున నగదు అందజేయడం అభినందనీయన్నారు. గత ఏడాది మాదిరిగానే విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దాత చంద్రశేఖర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో కలువ ప్రసాద్, రాచర్ల నరేష్, బి.వెంగళరావు గుప్తా, కె.రమేష్, వి.వెంకటేశ్వర్లు, కె.చెంగాలయ్య, లోకేష్ గుప్తా పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పాలన


ఉలవపాడులో సర్టిఫికెట్లు అందచేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉలవపాడు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు నేరుగా ఇంటి వద్దకే సర్టిఫికెట్లు అందుతున్నాయని ఎంపీడీఓ చెంచమ్మ అన్నారు. స్థానిక మూడో సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్షలో ఆమె మాట్లాడారు. ఎలాంటి రుసుం లేకుండా ఉచితంగా సర్టిఫికెట్లు అందచేయడంతో పాటు ప్రజల సమస్యల వినతులను కూడా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందచేశారు. ఎంపీపీ మస్తానమ్మ, మండల కో ఆప్షన్ సభ్యుడు ఖాదర్‌బాషా, సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీటీసీ ఫైజున్నీసా, జెసీఎస్ కన్వీనర్ ధనకోటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ కృష్ణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు రాము, భీమయ్య, శివ, ఏపీఎం నవీన్, డీటీ వీరయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రమాద రహిత రవాణానే ధ్యేయం


డ్రైవర్లు, కండక్టర్లతో మాట్లాడుతున్న సీటీఎం ఎస్‌కే ఇబ్రహీం

● నెల్లూరు జోన్ సీటీఎం ఎస్‌కే ఇబ్రహీం

కనిగిరి రూరల్: ప్రమాద రహిత ప్రజా రవాణాయే ధ్యేయమని నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం ఎస్‌కే ఇబ్రహీం అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైవర్లు, కండక్టర్లతో జరిగిన అవగాహన కార్యక్రమంలో సీటీఎం మాట్లాడుతూ ప్రజా రవాణ సంస్థలో పనిచేసే ఉద్యోగులంతా క్రమశిక్షణతో విధి నిర్వహణ చేయాలన్నారు. వర్షాకాలంలో ఆర్టీసీ సంస్థ సూచించిన ప్రమాద రహిత సూత్రాలను పాటించాలన్నారు. కనిగిరి డిపోను ఆదాయంలో ప్రథమస్థానం నిలిపేందుకు అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. కనిగిరి డిపోలో ఉన్న ఖాళీ స్థలాన్ని బీఓటీ ప్రాతిపదికన లీజుకు ఇస్తామని, ఆసక్తి ఉన్న వారు టెండర్‌లో పాల్గొనాలని తెలిపారు. తొలుత డిపోను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీమన్నారాయణ, అసిస్టెంట్ మేనేజర్ ఏవీ రమణమ్మ, ఏఎంఎఫ్ రవి, ఏడీసీలు, యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు


గార్లదిన్నెలో ఉత్సవాలకు సిద్ధమైన పీర్లు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని వెలుగువారిపాలెం పంచాయతీ గంగపాలెం మొహర్రం వేడుకల్లో దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సోదరుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర పాల్గొన్నారు. గ్రామంలో గురువారం పీర్ల పండగను ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ముస్లిం నాయకులు డాక్టర్ మైసూర్ బాలాజీ, లాల్‌లు ఏర్పాటు చేసిన పీర్ల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచ్ బ్రహ్మారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ కమిటీ సభ్యులు అనిల్‌రెడ్డి, బెల్లంకొండవారిపాలెం, రజానగరం సర్పంచ్‌లు పోశం సుమలతా శ్రీకాంత్‌రెడ్డి, వలి, దర్శి కౌన్సిలర్ వీసీరెడ్డి, నాయకులు యలమందారెడ్డి, వెలుగువారిపాలెం మాజీ సర్పంచ్ ఓబులరెడ్డి పాల్గొన్నారు.

పీర్ల పండగకు ఏర్పాట్లు సిద్ధం

కొనకనమిట్ల: మొహర్రం పండగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో పీర్ల చావిళ్లను, ఉత్సవ పీర్లను వేడుకలకు సిద్ధం చేశారు. బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమినపెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, గనివానిపాడు, నాయుడుపేట, చినారికట్ల గ్రామాల్లో పీర్ల చావిళ్ల వద్ద ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం రాత్రి చిన్న షరిగత్, శనివారం పెద్ద షరిగత్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయా గ్రామాల కమిటీ పెద్దలు పేర్కొన్నారు.

సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు గిరిజన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శామ్యూల్‌జోబు తెలిపారు. 6వ తరగతిలో 16 మంది బాలికలు, 2 బాలుర సీట్లు, 7వ తరగతిలో 1 బాలురు, 1 బాలికల సీట్లు, 8వ తరగతిలో 1 బాలిక, 4 బాలుర సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. దీంతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరం హెచ్‌ఈపీ-4 సీట్లు, ఎంపీసీ-4 సీట్లు ప్రవేశం కోసం ఈ నెల 29వ తేదీ లోపు 80966 25818 నంబర్‌కు పూర్తి వివరాలతో వాట్సప్ చేయాలని ఆయన కోరారు.

చోరీల నిరోధంపై ప్రత్యేక దృష్టి

● డీఎస్పీ వీర రాఘవరెడ్డి



మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో దొంగతనాలను నిరోధించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మార్కాపురం డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మార్కాపురం పట్టణంలో ఇటీవల జరిగిన రెండు చోరీల్లో నిందితులను గుర్తించేందుకు స్పెషల్ టీములను ఏర్పాటు చేశామన్నారు. వ్యాపార సంస్థల ప్రతినిధులు, గృహ యజమానులు అతి తక్కువ ఖర్చుతో తమ ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పనులు, ఇతర కార్యక్రమాలకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. పాత నేరస్తుల కదలికలపైనా నిఘా ఉంచామన్నారు. ప్రజలు కూడా తమ పరిధిలో అనుమానాస్పదంగా ఇళ్ల వద్ద, వీధుల్లో ఎవరైనా తిరుగుతుంటే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.